


బొడ్రాయికి ప్రత్యేక పూజలు

గుంటూరు రూరల్: వరుస మరణాలతో హడలెత్తిపోతున్న తురకపాలెం గ్రామ ప్రజలు బొడ్రాయికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు.



పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 68,340 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. దిగువకు 89,306 క్యూసెక్కులు వదులుతున్నారు.

తెనాలిలో రేషన్ షాపు సీజ్



తెనాలిరూరల్: సాలిపేటలో ఉన్న 39వ రేషన్ దుకాణాన్ని సీజ్ చేసినట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ శుక్రవారం తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదుల మేరకు రేషన్ షాపులో ఆకస్మిక తనిఖీలు నిర్వహించామని చెప్పారు. ఫిర్యాదులు వాస్తవం అని తేలడంతో సీజ్ చేసినట్టు తెలిపారు.

న్యూస్‌రీల్

నేడు జాతీయ లోక్ అదాలత్

నరసరావుపేట టౌన్: జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకొని విలువైన సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవాలని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ డాక్టర్ ఎస్. సత్యశ్రీ శుక్రవారం తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. అదాలత్‌లో అన్ని సివిల్ కేసులతోపాటు రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, బ్యాంక్, మోటార్ వాహన ప్రమాదాలు, చెల్లని చెక్కు, మనోవర్తి, కుటుంబ తగాదాలు, ముందస్తు వ్యాజ్యపు కేసులను పరిష్కరించుకోవచ్చు అని తెలిపారు.

కనకదుర్గమ్మ సేవలో కలెక్టర్ దంపతులు



భవానీపురం (విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మ వారిని కలెక్టర్ దంపతులు దర్శించుకున్నారు. నూతనంగా నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా హిమాన్షు శుక్లా, పల్నాడు జిల్లా కలెక్టర్‌గా కృతికా శుక్లా నియమితులైన నేపథ్యంలో శుక్రవారం వారు కుటుంబసభ్యులతో కలిసి శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి విచ్చేశారు. వారికి ఆలయ కార్యనిర్వహణాధికారి వీకే శీనానాయక్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులతో వేదాశీర్వచనం చేయించారు. అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

పీజీ కోర్సుల ఫలితాలు విడుదల


పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో జూలైలో జరిగిన పీజీ కోర్సుల రెండవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సీఈ ఆలపాటి శివప్రసాదరావు శుక్రవారం విడుదల చేశారు. ఎంఎస్సీ బయోటెక్నాలజీలో 32 మందికి 32 మంది, ఎమ్మెస్సీ సాయిల్ సైన్స్ అండ్ అగ్రికల్చరల్ కెమిస్ట్రీలో 15 మందికి 12 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంఎస్సీ సైకాలజీలో 24 మందికి 21 మంది, ఎంఎస్సీ ఫోరెన్సిక్ సైన్సెస్‌లో 24 మందికి 24 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. వీరిలో ఎవరైనా రీవాల్యుయేషన్ కోసం ఈనెల 22వ తేదీలోగా ఒక్కొక్క పేపరుకు రూ.1860 చెల్లించి పరీక్షల కోఆర్డినేటర్‌కు దరఖాస్తులు అందేలా పంపాలని ఆలపాటి శివప్రసాదరావు సూచించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



నరసరావుపేట రూరల్: రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి చెందిన ఘటన ఉప్పలపాడు గ్రామ సమీపంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సంతమాగులూరు మండలం యేల్చూరు గ్రామానికి చెందిన విజయ్(21) పట్టణంలోని ప్రైవేటు డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం నరసరావుపేట నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్లే క్రమంలో ఉప్పలపాడు సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో విజయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. రూరల్ ఎస్‌ఐ కిషోర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి భౌతికకాయం వితరణ



తెనాలి: అమ్మ ఐ ఆర్గాన్ అండ్ బాడీ డొనేషన్ ప్రమోటర్స్ ఆర్గనైజేషన్ సహకారంతో మృతిచెందిన ఒక వ్యక్తి కళ్లు, భౌతికకాయాన్ని దానం చేసినట్టు సంస్థ తెనాలి కో–ఆర్డినేటర్ నందూరి నారాయణరావు తెలియజేశారు. గుంటూరుకు చెందిన 73 ఏళ్ల వయసు గల ప్రభుత్వ ఉద్యోగి కొత్తపల్లి హరిబాబు శుక్రవారం మృతిచెందారు. ఆయన భార్య అపర్ణరాణి, కుమార్తె బీకే దీప్తి సమ్మతితో హరిబాబు నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ ఐ బ్యాంక్‌కు, భౌతికకాయాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనల నిమిత్తం కాటూరి మెడికల్ కాలేజీకి అందజేసినట్టు నారాయణరావు తెలిపారు. ఈ సత్కార్యానికి సంస్థ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు గంజి ఈశ్వరలింగం అభినందించారని వివరించారు.

వాస్తవాలు చెబుతోందనే 'సాక్షి'పై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు



ప్రజలకు వాస్తవాలు తెలియజేస్తున్న సాక్షిపై కూటమి సర్కారు అక్కసు వెళ్లగక్కుతుంది. ప్రతిపక్ష నేతలను, ప్రజల పక్షాన మాట్లాడే సాక్షిని నోరు మూయించే ఉద్దేశంతో వ్యవహరిస్తున్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చెప్పిన విధంగా 'ఇస్ ద ప్రెస్ ఇన్ ద హ్యాండ్.. ఈజీ టు మ్యానుఫ్యాక్చర్ ద గ్రేట్ మాన్' అనే మాటలు చంద్రబాబు, లోకేష్‌ల విషయంలో నిజమయ్యాయి. దివంగత ఎన్టీఆర్‌కు ఉన్న ప్రజాబలం చంద్రబాబు, లోకేష్‌లకు లేనప్పటికీ పచ్చ పత్రికలు ఈనాడు, ఆంధ్రజ్యోతి వారిని నాయకులుగా చేశాయి. చంద్రబాబు పాలనలో చేసిందేమీ లేకపోయినా రాష్ట్రంలో ఏదో అద్భుతాలు జరుగుతున్నట్లు చూపిస్తున్నారు. ప్రజలకు ఇవన్నీ సరికాదని చెబుతున్నందుకు సాక్షిపై అక్రమ కేసులు పెడుతున్నారు. సిబ్బందిని ఇబ్బందులు గురిచేయడం సరికాదు. తప్పులు సరిచేసుకోకుండా కక్ష సాధింపు సిగ్గుచేటు. అసత్యాలు, అసందర్భాలపై నిరంతర పోరాటం చేసే సాక్షిని ఆపటం ఎవరి తరం కాదు. అక్రమ కేసులు, అరెస్టులు చేసినంత మాత్రాన నిజాయితీగా కలం చేతబట్టిన జర్నలిస్టులను ఆపలేరు. తిరిగి బయటకు వచ్చిన తర్వాత ప్రజలకు వాస్తవాలను వెల్లడించే ధైర్యం వారికి ఉంది. – మోదుగుల వేణుగోపాలరెడ్డి, మాజీ ఎంపీ



మీడియా స్వేచ్ఛను హరించాలనుకోవడం సిగ్గుచేటు



ప్రశ్నించే హక్కు, తప్పొప్పులను వెలికితీసే హక్కు సమాజంలో మీడియాకు ఉంది. వారి హక్కులను, స్వేచ్ఛను హరించేలా వ్యవహరించడం సిగ్గుచేటు. సాక్షి దినపత్రిక ఎడిటర్‌తోపాటు పలువురు జర్నలిస్టులపై తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో అక్రమంగా కేసులు బనాయించి విచారణ పేరుతో పిలవడం మంచిది కాదు. ఏమైనా లోపాలుంటే వివరణ ఇస్తే సరిపోతుంది, కానీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ రాజకీయాలు చేయడం వలన ప్రజలకు ఏం సందేశం ఇస్తున్నారో ఆలోచించుకోవాలి. పత్రికా స్వేచ్ఛను కాలరాస్తూ వాక్ స్వాతంత్ర్యాన్ని హరిస్తున్న ఇలాంటి చర్యలను మానుకుంటే మంచిది.
– నందిగం సురేష్, మాజీ ఎంపీ, బాపట్ల

యూరియా కోసం మొన్న ముప్పాళ్లలో .. నిన్న దొడ్లేరులో ... నేడు సత్తెనపల్లిలో అన్నదాతలకు అగచాట్లు తప్పడం లేదు. యూరియా .. ఆర్తనాదాలు చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఒక బస్తా ఎరువు కోసం మండే ఎండలో రోజంతా పడిగాపులు కాయక తప్పడం లేదు. చాంతాడంత క్యూలైన్‌లో నిల్చోవాల్సి వస్తోంది. అప్పటికీ దొరుకుతుందో .. లేదో.. తెలియని పరిస్థితి. గత ప్రభుత్వ హయాంలో ఎన్నడూ చూడని దుస్థితిని నేడు ఎదుర్కొంటున్న రైతన్నకు కూటమి ప్రభుత్వం విషమ పరీక్ష పెడుతోంది. ఎరువుల కోసం అన్నదాతల ఆవేదన రోదనగానే మిగులుతోంది.

యూరియా .. ఎక్కడయ్యా!

- జిల్లాలో కొనసాగుతున్న యూరియా కష్టాలు
- క్యూలైన్లలో అవస్థలు పడుతున్న రైతులు
- తప్పకనే బ్లాక్ మార్కెట్‌లో కొనుగోలు



సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలోని జీడీసీఎంఎస్ గోదాం వద్ద క్యూలైన్‌లో రైతులు

సత్తెనపల్లి: జిల్లాలో ఏ మండలంలో రైతును కదిపినా కొందామంటే యూరియా లేదనే మాటే వస్తోంది. రైతులపై కూటమి ప్రభుత్వం కక్ష సాధిస్తుంది. రైతులు పొలాలను వదిలి సొసైటీల వద్ద పడిగాపులు పడాల్సి వస్తుంది. ఇటీవల ముప్పాళ్ళ, దొడ్లేరులో రైతులు బారులు తీరి ఎరువుల కోసం ఆందోళన చెందారు. శుక్రవారం సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలోని జీడీసీఎంఎస్ లిమిటెడ్‌కు యూరియా 20 మెట్రిక్ టన్నులు(440 బస్తాలు) రావడంతో రైతులు క్యూకట్టారు. దీంతో పోలీసుల బందోబస్తు మధ్య ఒక్కొక్కరికి రెండు బస్తాల చొప్పున పంపిణీ చేసేందుకు 220 మంది రైతులకు వ్యవసాయశాఖ అధికారులు టోకెన్‌లు పంపిణీ చేశారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం వరకు పడి గాపులు కాస్తే కొందరు రైతులకు మాత్రమే టోకెన్‌లు అందాయి. ఆ రెండు బస్తాల టోకెన్‌లు కూడా రాని రైతులు ఉసూరుమంటూ వెనుతిరిగి వెళ్ళాల్సిన పరిస్థితి.

ప్రకటించి .. పరిహాసం చేసి...

రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని సహకార సంఘాల (పీఏసీఎస్) ద్వారా, రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా అందజేస్తామని ప్రకటించింది. పలుకు బడి కలిగి ఎక్కువ భూములు ఉన్న రైతులకు సంఘాల అధికారులు ఎక్కువగా యూరియా అందిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. దీంతో సన్న, చిన్న కారు రైతులకు యూరియా అందడం లేదు.

బ్లాక్ మార్కెట్‌కు తరలింపు ...

వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేసిన దాని కన్నా యూరియా వినియోగం ఎక్కువగా ఉందని సమాచారం. ఇదే సమయంలో కృత్రిమ కొరత సృష్టించడం ద్వారా ఎక్కువ ధరకు కొందరు ప్రైవేటు వ్యాపారులు అమ్ముకున్నారు. 45 కిలోల యూరియా బస్తాకు రూ. 350 నుంచి రూ. 500 చెల్లించి బ్లాక్ మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.



పోలీసుల సమక్షంలో యూరియా కోసం రైతుల అగచాట్లు

అన్నదాతల పడిగాపులు



సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులోని జీడీసీఎంఎస్ గోదాములో ఎరువులు పంపిణీ చేస్తున్నారంటే ఉదయం ఏడు గంటలకు వచ్చా. మధ్యాహ్నం రెండు గంటల సమయానికి టోకెన్ ఇచ్చారు. ఈ టోకెన్ కి రెండు యూరియా బస్తాలు ఇస్తామన్నారు. నేను నా సొంత భూమి రెండున్నర ఎకరాలు, కౌలు భూమి ఒకటిన్నర ఎకరాల్లో పంట లు సాగు చేశా. ఎకరానికి ఐదు చొప్పున 20 బస్తాలు ఎరువులు కావాలి. కనీసం 10 బస్తాలైన ఇవ్వమంటే వస్తే ఇస్తాం లేకపోతే లేదని సమాధానం ఇస్తున్నారు.
– శ్రీనివాసరావు, రైతు, గోరంట్ల, సత్తెనపల్లి రూరల్

బ్లాక్ మార్కెట్ నియంత్రించాలి



యూరియా బ్లాక్ మార్కెట్ జరక్కుండా నియంత్రించాలి. రైతులకు మేలు చేసేలా రైతు సేవా కేంద్రాలకు ఎరువుల సరఫరా జరగాలి. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తు నుంచి పంట విక్రయం వరకూ రైతులకు మేలు జరిగేలా చేశారు. ఎక్కడా ఎరువుల కోసం ఒక్క రైతు కూడా రోడ్డెక్కిన పరిస్థితులు నాడు లేవు. ఇప్పుడు పొలాలు వదిలేసి ఎరువుల కోసం ఆందోళన చెందుతున్నారు.
– బండి కోటి నాగిరెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం, సత్తెనపల్లి

రైతులు ఆందోళన చెందవద్దు



ఇప్పటి వరకు 2,400 మెట్రిక్ టన్నులు యూరియా పంపిణీ చేశాం. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదు. అవసరం మేరకు ఎరువులు పొందాలే తప్ప అధిక నిల్వలు చేసుకోవద్దు. సొసైటీలు, రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులు పంపిణీ చేస్తాం. రైతులు ఇబ్బంది పడకుండా పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ తీసుకొని టోకెన్‌లు ఇచ్చి ఎరువులు సరఫరా చేపడుతున్నాం.
– బి.రవిబాబు, సహాయ వ్యవసాయ సంచాలకులు, సత్తెనపల్లి

కోటప్పకొండలో నిఘా పెంచాలి

- జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశం
- యల్లమందలో అదనపు ఎస్పీ పర్యటన



కొండ ప్రాంతాలను పరిశీలిస్తున్న రూరల్ ఎస్‌ఐ కిషోర్

సాక్షి ఎఫెక్ట్

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ పరిసర ప్రాంతాల్లో చోటుచేసుకుంటున్న దోపిడీ ఘటనలపై పోలీసులు దృష్టి సారించారు. దోపిడీలతో భీతిల్లుతున్న పేట ప్రజలు పేరుతో సాక్షి పత్రికలో వచ్చిన కథనంతో పోలీసుల్లో చలనం వచ్చింది. జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు కోటప్పకొండ ప్రాంతంలో పర్యటించారు. జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబుతో కలిసి త్రికోటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న తర్వాత శాంతిభద్రతలపై పోలీసు అధికారులతో సమీక్షించారు. అసాంఘిక కార్యక్రమాలు, దోపిడీలు జరగకుండా నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. డ్రోన్‌లను ఉపయోగించి కోటప్పకొండలో నేరాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. యాత్రికులకు అసౌకర్యం కలగకుండా ఇద్దరు సిబ్బందితో బీట్ ఏర్పాటు చేయాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, పేకాట నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోటప్పకొండ గిరిప్రదక్షిణ రహదారి, కొండ ప్రాంతంలో పోలీసు సిబ్బందితో రూరల్ ఎస్‌ఐ కిషోర్ పరిశీలించారు. అలాగే జిల్లా అదనపు ఎస్పీ జేవీ సంతోష్ యల్లమంద గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడి అసాంఘిక కార్యక్రమాల గురించి ఆరా తీశారు.

కలెక్టర్ గారూ.. కష్టాలు తీర్చరూ..

- జిల్లా నూతన కలెక్టర్ కృతికా శుక్లాకు సమస్యల స్వాగతం
- కూటమి పాలనలో కుంటుపడిన జిల్లా అభివృద్ధి, సంక్షేమం



నూతన కలెక్టర్‌గా శనివారం బాధ్యతలు స్వీకరించున్న కృతికా శుక్లాకు పల్నాడు జిల్లాలోని సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. జిల్లాను అభివృద్ధి, సంక్షేమం పరంగా మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లా తొలి మహిళా కలెక్టర్‌గా తన మార్కు పాలన చేసి ప్రజల కష్టాలను తొలగించేందుకు కృషి చేయాలని కోరుతున్నారు.

సాక్షి, నరసరావుపేట: ఉమ్మడి గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా చేసిన అనుభవంతో జిల్లా భౌగోళిక స్వరూపంపై ఇప్పటికే కృతికా శుక్లాకు అవగాహన ఉంది. వ్యవసాయాధారిత జిల్లా అయిన పల్నాడులో రైతుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. 20 రోజులుగా యూరియా దొరక్క తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో పంటలకు సరైన మార్కెటింగ్ కల్పిస్తే ఎంతో మేలు చేకూరనుంది.

పడకేసిన విద్య, వైద్యం...

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో ప్రజలకు మెరుగైన సేవలు అందాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక సర్కార్ వైద్యరంగానికే జబ్బు చేసింది. జిల్లాలోని నరసరావుపేట ఏరియా వైద్యశాలతోపాటు పీహెచ్‌సీలలో సమస్యలు తిష్ట వేశాయి. దీనిపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంది. గతేడాది అక్టోబర్‌లో దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని అంజనాపురం కాలనీ వాసులు పదుల సంఖ్యలో డయేరియాతో బాధపడ్డారు. ఇదే కాలనీలో మరణాలు కూడా సంభవించాయి. రక్షిత మంచినీరు సరఫరా చేయకపోవడంతో డయేరియా విస్తరించింది. జిల్లాలో జేజేఎం పనులు నత్తనడకన సాగుతుండటంతో ప్రజలకు మంచినీరు అందించడంలో వెనుకబాటు కనిపిస్తోంది. ఇలాంటి ఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. మరోవైపు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాడు-నేడు, ట్యాబ్‌లు, ఇంగ్లిష్ మీడియం వంటి సంస్కరణలతో విద్యాభివృద్ధి పరుగులు పెట్టింది. దీనిపై దృష్టి పెడితే జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మెరికల్లాంటి విద్యార్థులున్నారని గతేడాది పదోతరగతి ఫలితాల ద్వారా నిరూపితమైంది. జిల్లాలో కళాశాలలు లేని మండలాల్లో నూతనంగా ఏర్పాటు అయ్యేలా కృషి చేయాల్సి ఉంది. అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును మెరుగుపరచాల్సి బాధ్యత కలెక్టర్‌పై ఉంది. కూటమి వచ్చాక జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.



పల్నాడు జిల్లా కలెక్టరేట్

జిల్లా కేంద్రంపై దృష్టి అవసరం

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట అభివృద్ధి మందగించింది. ముఖ్యంగా జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్య జటిలంగా మారింది. పరిష్కారానికి గత ప్రభుత్వం మల్లమ్మ సెంటర్‌లో ఫ్లయ్ ఓవర్, చిత్రాలయ టాకీస్ వద్ద ఆర్‌యూబీ నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేసింది. దీనిపై నూతన కలెక్టర్ దృష్టి సారిస్తే ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే అవకాశం ఉంటుంది. జీఎస్‌టీయూ భవనాల పూర్తి, ఆటోనగర్ ఏర్పాటు, కోటప్పకొండ అభివృద్ధి వంటి పనులు ఎక్కడిక్కడే నిలిచిపోయాయి. జిల్లా అభివృద్ధి తనదైన ముద్ర వేసి, అందరూ గుర్తుంచుకునేలా విధులు నిర్వర్తించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

రెవెన్యూ సమస్యలతో సతమతం

వారం వారం జిల్లా కేంద్రానికి వస్తున్న ప్రజాఫిర్యాదులలో అధిక భాగం రెవెన్యూ సమస్యలే ఉంటున్నాయి. గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో వాటి పరిష్కారంలో తాత్సారం జరుగుతోంది. మరోవైపు సిబ్బంది, అధికారులు లంచాలు తీసుకుని సమస్యలు తీర్చకపోగా కొత్తవాటిని పుట్టిస్తున్నారనే అపవాదు ఉంది. భూముల రీసర్వే, అగ్రహారం భూముల సమస్యలను తీర్చాల్సి ఉంది. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ గాడి తప్పింది. సచివాలయ సిబ్బంది సేవలను సరైన రీతిలో వాడుకుంటే ప్రజలకు ఎంతో మేలు చేకూరనుంది. జిల్లా వరప్రదాయినిగా పిలిచే వరికపూడిసెల ప్రాజెక్టు పనుల్లో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత తట్టెడు మట్టి కూడా ఎత్తలేదు. ఈ ప్రాజెక్టు పనులు పురోగతి సాధించేలా జిల్లా ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకొంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించాల్సి ఉంది.

ఘనంగా కళా ఉత్సవం

విద్యార్థుల ప్రతిభకు వేదికగా నిలిచిన వేడుక

యడ్లపాడు: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) కళాశాల విద్యార్థులతో కళకళలాడింది. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో గురువారం కళా ఉత్సవం –2025 పోటీలు ఘనంగా జరిగాయి. గురు, శుక్రవారాల్లో ఆరు కళలకు సంబంధించి 12 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా గాత్రం, శాస్త్రీయ సంగీతం (సోలో - గ్రూప్), నాట్యం (సోలో - గ్రూప్), వాయిద్య సంగీతం, థియేటర్, డ్రాయింగ్, స్టోరీ టెల్లింగ్ వంటి అంశాల్లో వివిధ పాఠశాలలకు చెందిన 200 మంది తమ ప్రతిభను ప్రదర్శించారు. జిల్లా విద్యాశాఖ అధికారి, డైట్ కళాశాల ప్రిన్సిపల్ ఎల్ చంద్రకళ పర్యవేక్షణలో కార్యక్రమ నిర్వహణకు డాక్టర్ ఎన్ విమలకుమారి నోడల్ అధికారిగా, న్యాయ నిర్ణేతలుగా పలువురు ప్రముఖులు వ్యవహరించారు. ఉత్సవాల రాష్ట్ర పరిశీలకులు కల్పన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులలో కళానైపుణ్యాలను వెలికితీయడానికి, సంస్కృతి– సంప్రదాయాలపై అవగాహన కల్పించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ మాట్లాడుతూ విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రదానం చేశామని తెలిపారు. పాల్గొన్న అందరికీ ధ్రువపత్రాలను అందజేశామని పేర్కొన్నారు. డిప్యూటీ డీఈవో ఎస్‌ఎం సుభాని మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్య ప్రదర్శనకు, కళా రంగంలో మరింత ముందుకు వెళ్లడానికి చక్కటి వేదికగా కార్యక్రమం నిలిచిందన్నారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు వై.శ్రీనివాసరావు, ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.



జానపద నృత్యం చేస్తున్న విద్యార్థినులు



కళాకారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న డీవైఈవో ఎస్‌ఎం సుభాని

ఎయిడ్స్‌పై అవగాహనకు మొబైల్ వాహనం



నరసరావుపేట: అవగాహన కల్పించడానికి రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ జిల్లాకు అందజేసిన మొబైల్ ఐఈసీ వాహనం ఉపయోగకరంగా ఉంటుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ప్రాంగణంలో వాహనానికి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడుతూ మొబైల్ వాహనం ద్వారా ప్రజలకు వ్యాధిపై అవగాహన పెంచుతామన్నారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ వాహనాన్ని జిల్లాకు కేటాయించినందుకు సంస్థకి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ఎయిడ్స్ ప్రోగ్రాం మేనేజర్ జానీబాషా, క్లస్టర్ ప్రివెన్షన్ ఆఫీసర్ కిరణ్‌కుమార్, ఐసీటీసీ కౌన్సిలర్ రవి, పీపీటీసీటీ కౌన్సిలర్ జ్యోతి సిబ్బంది పాల్గొన్నారు.

అధిక ధరకు ఔషధాల విక్రయం కేసులో ఒకరోజు జైలు

నరసరావుపేట టౌన్: ఔషధాలపై అధిక ధరను ముద్రించి విక్రయించినట్లు నేరం అంగీకరించడంతో సదరు కంపెనీ ప్రతినిధులైన రాజేష్ భాటియా, నవీన్ భాటియాలకు ఒక రోజు జైలు శిక్ష, రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి ఎ.సలోమీ శుక్రవారం తీర్పు వెలువరించారు. 2017లో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన రీమస్ ల్యాబ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు కోపిర్జిన్ 750 ఎంజీ మందులను ప్రభుత్వం నిర్దేశించిన ధర కంటే అధిక ధరను ముద్రించి విక్రయించారు. ఫిర్యాదు అందటంతో అప్పటి నరసరావుపేట డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పారా శ్రీరామ్మూర్తి తనిఖీ చేసి కేసు నమోదు చేశారు. సదరు కంపెనీ ప్రతినిధులు ఇద్దరిపై కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. ప్రస్తుత డ్రగ్ ఇన్‌స్పెక్టర్ డి.సునీత ఆ నిందితులు కోర్టుకు హాజరయ్యేలా చర్యలు చేపట్టారు. నిందితులు నేరం అంగీకరించడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

చందాల పేరిట దందా

- రూ. 9 కోట్లు ఖర్చవుతుందని లెక్కలేసిన అధికారులు
- రూ. 4 కోట్లు ఇస్తామన్న ప్రభుత్వం
- మిగిలింది చందాల రూపంలో వసూలుకు కూటమి సర్కార్ ఆదేశం

సాక్షి ప్రతినిధి, బాపట్ల : అధికారమప్పగిస్తే సంపద సృష్టించి అందరికీ పంచుతానన్న చంద్రబాబు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యమంత్రి అయ్యాక సంపద సృష్టించడం మాని, విచిత్రంగా చందాలివ్వమంటూ యాచన కార్యక్రమాన్ని తెరపైకి తెచ్చారు.తొలుత అమరావతి నిర్మాణానికి చందాల దందా మొదలు పెట్టారు. ఆ తర్వాత ప్రకటించిన అన్నా క్యాంటీన్లకు చందాలు ఇస్తే పేర్లు వేస్తామని బంపరాఫర్ కూడా ఇచ్చారు. తరువాత పీ–4 తెరపైకి తెచ్చారు. పేదలందరినీ ఉన్నోళ్లను చేస్తానన్నారు. పోనీ ఆ పథకమైనా సంపద సృష్టించి చేస్తారులే అని ఆశిస్తే దానికీ యాచనలే అజెండా ! డబ్బున్న వారికి పేద కుటుంబాలను దత్తత ఇచ్చి బాగు చేస్తానని చెప్పారు. అదైనా కొంత మెరుగులే అనుకుంటే.. ఇప్పుడు స్థితిమంతులు దొరకలేదంటూ ప్రభుత్వ ఉద్యోగులకే ఆ బాధ్యత అప్పగిస్తున్నారు. తమ వంతు ఎప్పుడొస్తుందోనని బెంబేలెత్తి పోతున్నారు.

26 నుంచి బీచ్ ఫెస్టివల్

ఇప్పుడు బాపట్ల సముద్ర తీరంలో బీచ్ ఫెస్టివల్ చేస్తున్నాం.. చందాలివ్వమంటూ కూటమి ప్రభుత్వం వసూళ్ల పర్వానికి తెర తీసింది. జిల్లాలోని బాపట్ల సూర్యలంక, చీరాల ప్రాంతంలోని ఓడరేవు, రామాపురం తీరంలో ఈనెల 26,27,28 తేదీల్లో ఘనంగా నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్ర పర్యాటకశాఖ, జిల్లా పరిపాలనా విభాగం కలిసి పండుగను చేయాలని ఆదేశించింది. పాట కచేరీలు, ఎగ్జిబిషన్, సాంస్కృతిక కార్యక్రమాలు, బీచ్ కబడ్డీ, వాలీబాల్, హ్యాండ్‌బాల్, ఖోఖో ఆటలతోపాటు లేజర్‌షోలు, ఫుడ్‌కోర్టులు నిర్వహించి బీచ్ ఫెస్టివల్‌ను హోరెత్తిస్తామని చెబుతోంది. సర్కార్ కీర్తిని ఏపీతోపాటు సముద్రం ఆవల వున్న శ్రీలంక వరకూ చాటుతామని ఆర్భాటంగా చెప్పింది.

నిధుల మంజూరులో మెలిక

బీచ్ పండుగను చూడొచ్చని జనం కూడా సంబరపడ్డారు. తీరా నిధులు మంజూరులో ప్రభుత్వం మెలిక పెట్టింది. రూ. 9 కోట్లు ఖర్చయ్యే ఫెస్టివల్‌కు రూ. 4 కోట్లు మాత్రమే ఇస్తామని చావుకబురు చల్లగా చెప్పింది. మిగిలిన రూ. 5 కోట్ల మొత్తాన్ని చందాలు బాది వసూలు చేసుకోవాలని సూచించింది.

బలవంతపు వసూలు

బీచ్ ఫెస్టివల్ పేరుతో జేబులు నింపుకోవచ్చని భావించిన ఈ ప్రాంతానికి చెందిన కొందరు పచ్చనేతలు, అధికారులు వెనువెంటనే రంగంలోకి దిగారు. రూ. 5 కోట్ల వసూళ్లకు ప్రణాళిక సిద్ధం చేశారు. రిసార్ట్‌లు, రైస్ మిల్లర్స్, బియ్యం వ్యాపారులు, మెడికల్ అసోసియేషన్, హోటల్స్, ఆక్వా, హేచరీస్, గోల్డ్ వ్యాపార వర్గాలకు రూ. 15 లక్షల నుంచి రూ. 50 లక్షల వరకూ ఇవ్వాలంటూ హుకుం జారీ చేశారు. మెడికల్ అసోషియేషన్‌కు రూ. 15 లక్షలు, రిసార్ట్‌లకు రూ. 50 లక్షలు, రైస్‌మిల్లు, రేషన్ వ్యాపారుల అసోసియేషన్లకు రూ. 25 లక్షలు, రియల్టర్లకు రూ. 25 లక్షలు చొప్పున చందా వేసినట్లు సమాచారం. జిల్లా వ్యాప్తంగా రూ.10 కోట్లకు పైనే వసూళ్లకు రంగం సిద్ధం చేసినట్లు ప్రచారం ఉంది.



సూర్యలంక బీచ్ జనం సందడి (ఫైల్)

అందరి నోళ్లు కొట్టి

బీచ్ ఫెస్టివల్ మంచిదే. పర్యాటకులు, స్థానికులు ఆస్వాదిస్తారు. కానీ ప్రభుత్వ ఖర్చుతో చేయకుండా బలవంతపు వసూళ్లతో అందరి నోళ్లకొట్టి పండుగలేమిటో? అంటూ వ్యాపారుల అసోసియేషన్లు గొల్లుమంటున్నాయి. బీచ్ ఫెస్టివల్ పేరుతో నేరుగా డబ్బులు వసూళ్లు చేస్తే ఆరోపణలు వస్తాయన్న కొందరు అధికారుల సూచనలతో పచ్చ నేతలు రూటు మార్చారు. స్పాన్సర్ల పేరున వసూళ్లకు దిగుదామంటూ పథక రచన చేసినట్లు సమాచారం. ఇప్పటికే వసూళ్ల పర్వం మొదలైనట్లు తెలుస్తోంది.

అర్ధంతరంగా కలెక్టర్ బదిలీ

ఈ సమయంలో జిల్లా కలెక్టర్ వెంకట మురళి గురువారం సాయంత్రం అర్ధంతరంగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వినోద్ కుమార్ కలెక్టర్‌గా వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 26,27,28 తేదీల్లో బీచ్ ఫెస్టివల్ ప్రభుత్వం ఇచ్చిన రూ. 4 కోట్లుతో జరుగుతుందా? లేక రూ. 10 కోట్ల చందా వసూళ్ల ప్రణాళిక ప్రకారం నడిపిస్తారా? అనేది వేచి చూడాలి.

చిరు వ్యాపారులపైనా కనికరం శూన్యం

పచ్చనేతలు, అధికారుల చందాలతో అన్ని వర్గాల వారు బెంబేలెత్తిపోతున్నారు. చిరు వ్యాపారుల అసోసియేషన్లను కూడా వదల్లేదు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న తమపై ఈ భారం ఏమిటి బాబో అన్నా కనికరం చూపడం లేదని ఓ మెడికల్ షాపు దుకాణదారుడు 'సాక్షి'తో వాపోయారు. రూ. లక్షల్లో ఈ వసూళ్లు ఏమిటంటూ బాపట్లకు చెందిన రైస్ మిల్లు యజమాని లబోదిబోమన్నారు. చీరాల, బాపట్ల ప్రాంతాల్లోని అందరు వ్యాపారులు బీచ్ ఫెస్టివల్ చందాలు చూసి జడుసుకుంటున్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులను వంచిస్తున్న ప్రభుత్వం

ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ మహమ్మద్ ఇబ్రహీం

సత్తెనపల్లి: ఉద్యోగ, ఉపాధ్యాయులను కూటమి ప్రభుత్వం వంచిస్తోందని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ మహమ్మద్ ఇబ్రహీం అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఉద్యమ కార్యాచరణ 'నిరసన వారం' రెండవ రోజు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సత్తెనపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. ఏపీటీఎఫ్ సత్తెనపల్లి మండలశాఖ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా కార్యదర్శి షేక్ మహమ్మద్ ఇబ్రహీం మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించటం ప్రభుత్వాలకు పరిపాటిగా మారిందన్నారు. ఏపీ జేఏసీ నాయకుడు ఎస్.అంబేడ్కర్, జిల్లా ఉపాధ్యక్షుడు బి.శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శి కాల్వపల్లి శివారెడ్డి, అధ్యక్షుడు ఫిరోజ్‌ఖాన్‌లు మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ కేఎస్ చక్రవర్తికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ బాధ్యులు కె.ఉషారాణి, అక్తరున్నిసా, వంజ సునీల్‌కుమార్, భవనం సుబ్బారెడ్డి, లెనినారాణి, దామోదరం, రేపూడి చిన్నపిచ్చయ్య, ప్రభావతి, ధర్మారావు, నీలం చంద్రం, పి.మారుతిరమేష్, దాసరి రవికుమార్, షేక్ జిలాని, ఏపీ జేఏసీ సత్తెనపల్లి తాలూకా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



సత్తెనపల్లి తహసీల్దార్ కేఎస్ చక్రవర్తికి వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

స్కూల్ గేమ్స్ కరాటే జట్లు ఎంపిక





ఎంపికైన బాలురు, బాలికల జట్ల సభ్యులు

నరసరావుపేట ఈస్ట్: ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్–14, 17 బాలబాలికల కరాటే జట్ల ఎంపిక పోటీలను పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సత్తెనపల్లిరోడ్డులోని డీఎస్ఏ స్టేడియంలో నిర్వహించారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.నరసింహారెడ్డి, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎస్.సురేష్‌బాబు, మహిళా కార్యదర్శి వి.పద్మావతి పోటీలను ప్రారంభించారు. వివిధ పాఠశాలల నుంచి 250 మంది పోటీ పడ్డారు. ఎంపికైన వారి వివరాలను జిల్లా ఎస్.సురేష్‌బాబు, పద్మావతి ప్రకటించారు.

పోలీసుల అదుపులో వైఎస్సార్‌సీపీ నేత శ్రీనునాయక్

వెల్దుర్తి: మండలంలోని కొత్తపుల్లారెడ్డి గూడేనికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కేతావత్ శ్రీనునాయక్‌ను శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శ్రీనునాయక్ గత కొంతకాలంగా హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఆయన్ను వెల్దుర్తి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు బంధువులు తెలిపారు. శ్రీనునాయక్‌ను ఏ కేసుకు సంబంధించి విచారణకు తీసుకొచ్చారో తెలియలేదని బంధువులు, కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక రేపు

చినగంజాం: బాపట్ల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయిలో అథ్లెటిక్స్ అండర్ 14,16,18,20 విభాగాల్లో బాలబాలికలు ఎంపిక నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బోగిరెడ్డి స్వామి రెడ్డి, కార్యదర్శి ఎం. వెంకటరెడ్డి తెలిపారు. సమాచారం కోసం 82473 18995, 95423 54041 నంబర్లను సంప్రదించాలని కోరారు.

వివాహిత మృతి

కొల్లూరు: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కొల్లూరుకు చెందిన కోటయ్య స్థానికంగా ఉన్న ఓ చికెన్ దుకాణంలో పనిచేస్తూ, భార్యతో కలసి జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 4న మద్యం తాగిన భర్త ఇంటికి ఆలస్యంగా వస్తానని ఫోన్‌లో తెలపడంతో మనస్తాపానికి గురైన భార్య వెంకటేశ్వరమ్మ ఇంటిలో ఉన్న ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ విషయాన్ని పొన్నూరు మండలం ఇటుకంపాడులో ఉండే సోదరుడికి ఈనెల 5 ఉదయం ఫోన్‌లో తెలపడంతో అతడు భర్తతో పాటు, మరో సోదరికి సమాచారం అందించాడు. అంతా కలసి తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు వెంకటేశ్వరమ్మను తరలించారు. 10న గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా, శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందింది.